

జనరల్ ఆస్పత్రిపై.. కలెక్టర్ నజర్

- జాయింట్ కలెక్టర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు
- శానిటేషన్ పర్యవేక్షణ అధికారులుగా హెల్త్ ఇన్‌స్పెక్టర్లు 6
- సూపర్‌వైజర్ల వ్యవస్థ తొలగింపు
- వాట్సాప్ గ్రూపు ద్వారా రోజూ పర్యవేక్షణ
- కలెక్టర్ చొరవతో మెరుగుపడిన పరిశుభ్రత




ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్(ఫైల్)

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిపై జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆస్పత్రిలో రోగులకు సకాలంలో వైద్యసేవలు అందడంతో పాటు, శానిటేషన్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు జాయింట్ కలెక్టర్ శివేంద్రప్రతాప్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీని పర్యవేక్షించేందుకు హెల్త్ ఇన్‌స్పెక్టర్లను పర్యవేక్షణ అధికారులుగా నియమించారు. ఇదివరకు శానిటేషన్ ఏజెన్సీలో ఉన్న సూపర్‌వైజర్ల వ్యవస్థను పూర్తిగా తొలగింపజేశారు. శానిటేషన్ వర్కర్ల పనితీరు, పరిసరాలు, వార్డుల పరిశుభ్రతను రోజూ పర్యవేక్షించేందుకు ఒక వాట్సాప్ గ్రూపును కూడా ఏర్పాటు చేశారు. తద్వారా ఆస్పత్రిని అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ కంకణం కట్టుకున్నారు.

- మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

పట్టపగలు చోరీ



మద్దూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఓ ఇంట్లో దొంగలు దూరి ఆరున్నర తులాల బంగారం అపహరించుకుపోయిన సంఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాంలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. పోతుల లత అనే ఓ ప్రైవేట్ టీచర్ పట్టణంలోని సాయిబాబా ఆలయ సమీపంలోని అద్దె ఇంట్లో నివాసముంటోంది. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో దాచి పెట్టిన ఆరున్నర తులాల బంగారు ఆభరణాలను అపహరించుకు వెళ్లాడు. ఇంట్లో చోరీ విషయం గురించి మంగళవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ దస్రునాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పోలీసులకు అభినందన



నారాయణపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ యోగేష్ గౌతమ్ వెండి పత కం అందుకున్న బాంబు డిస్పోజల్ (బీడీ) టీం కానిస్టేబుల్స్ చంద్రశేఖర్, అంజనేయులను అభినందించారు. ఈనెల 16 నుంచి 19 వరకు హైదరాబాద్ పోలీస్ అకాడమీలో జరిగిన రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్-2024 పోటీల్లో జోగుళాంబ జోన్-7 తరుపున పేట జిల్లా నుంచి యాంటీ సబ్జెక్ట్ చెక్ రూమ్ సెర్చ్‌లో ప్రతిభ కన బర్చి వెండి పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

న్యాక్ 'ఏ' గ్రేడ్ లక్ష్యం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఉపాధి కల్పన కోర్సులకు మొదటి ప్రాధాన్యం
- పీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్


పీయూ వీసీ శ్రీనివాస్

'పాలమూరు యూనివర్సిటీకి న్యాక్ 'ఏ' గ్రేడ్ సాధించడమే లక్ష్యంగా పని చేస్తా. ఇక్కడ తరగతి గదులు, హాస్టళ్లు, గ్రంథాలయం అన్ని వసతులు ఉన్నాయి. విద్యార్థులు చాలా మంది భవిష్యత్ మీద దృష్టితో గ్రంథాలయంలో ఎక్కువ సేపు ఉంటున్నారు. ఉపాధి అందించే కోర్సులను పెంచి, విద్యార్థులకు సంస్కారం నేర్పి సమాజానికి అందిస్తాం. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. వర్సిటీ అనుబంధ పీజీ సెంటర్లలో మౌలిక వసతులు కల్పిస్తాం. ఈ సారి ఎక్కువ నిధులు వస్తాయని ఆశిస్తున్నాం' అని అంటున్నారు పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

6


మాట్లాడుతున్న నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

కోస్గి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీ ఒక్కరం కృషి చేయాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్‌గౌతమ్ అన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై మంగళవారం కోస్గి కళాశాల మైదానంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలకే పరిమితమయ్యేవని, ఇప్పుడు కోస్గి.. నారాయణపేట వంటి ప్రాంతాలకు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఎక్కడ గంజాయి, డ్రగ్స్ కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్పీ యోగేష్‌గౌతమ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల బారినపడి అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయొద్దని చెప్పారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి, ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు డ్రగ్స్ నిర్మూలిస్తామని సంతకాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌డీ ఏపీడీ మొగులయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన ఎస్‌ఏ-1 పరీక్షలు

- నిబంధనలను పట్టించుకోని ప్రైవేట్ పాఠశాలలు
- విద్యార్థుల నుంచి అదనపు ఫీజు వసూలు


జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం సమీపంలో గల వేంకటేశ్వర కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఏ-1 పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు కొనసాగుతున్నాయి. అయితే నిబంధనల ప్రకారం అన్ని పాఠశాలల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి పరీక్షల విభాగం రూపొందించిన ప్రశ్నపత్రాలను ఉపయోగించి పరీక్షలు నిర్వహించాలి. కానీ, కేవలం ప్రభుత్వ, గురుకుల, కేజీబీవీ పాఠశాలల్లో మాత్రమే అది అమలవుతున్నది. ప్రైవేట్ పాఠశాలలు ఆ నిబంధనలను పట్టించుకోవడం లేదు. ఉమ్మడి పరీక్షల విభాగం రూపొందించిన ప్రశ్నపత్రాలు కాకుండా వేరే ప్రశ్నపత్రాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. అది కూడా విద్యాశాఖ సూచించిన సమయంలో కాకుండా తమకు అనుకూలంగా ఉన్న సమయంలో పరీక్షలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ ప్రైవేట్ పాఠశాలల వైపు చూడటం లేదు. మరోవైపు విద్యార్థుల నుంచి ప్రత్యేకంగా ఫీజులు వసులు చేస్తున్నారని కొందరు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తెచ్చారు. దాంతో 'ఆంధ్రజ్యోతి' మంగళవారం పలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి పరిశీలించింది. ఉమ్మడి పరీక్షల విభాగం తయారు చేసిన ప్రశ్నపత్రాల ద్వారానే పరీక్షలు నిర్వహిస్తున్నారా? అని ప్రిన్సిపాల్‌లను ఆరా తీసింది. దానికి వారు తాము తయారు చేసుకున్న ప్రశ్నపత్రాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ విషయమై ఓ ప్రైవేట్ పాఠశాల నుంచే డీఈవో రవీందర్‌కు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేసి మాట్లాడింది. అందుకు ఆయన తప్పనిసరిగా ఉమ్మడి పరీక్ష విభాగం ప్రశ్నప్రతాలనే వాడాలని ఆ పాఠశాల యాజమాన్యానికి సూచించారు. అయినా పట్టించుకోకుండా వారి ప్రశ్నపత్రాలతోనే పరీక్షలు నిర్వహించారు.



పోలీస్ శాఖపై అవగాహన ఉండాలి

మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి
పరేడ్ మైదానంలో 'ఓపెన్ హౌస్'
ఆయుధాలపై ప్రజలకు అవగాహన
7



రైతుల కోసం శివ అగ్రి క్లినిక్

యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్న శివ
వ్యవసాయదారులకు అండగా ఉండటమే లక్ష్యం
వారికి అవసరమైన వీడియోల రూపకల్పన
యూట్యూబ్‌లో 2.08 లక్షల సబ్‌స్క్రైబర్లు
7

కాసులిస్తేనే కార్డు!

- కార్మికశాఖలో దళారుల దందా
- పైసలిస్తే కార్మికులు కాకపోయినా కార్డులు
- జిల్లాలో 73,151 మంది కార్మికులు
- చూసీచూడనట్లు అధికారుల తీరు
- క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే జారీ


శిథిలావస్థలో ఉన్న భవనంలో కొనసాగుతున్న గద్వాల కార్మిక శాఖ కార్యాలయం

జోగుళాంబ గద్వాల జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాలలో కొంతకాలంగా దళారులు రాజ్యమేలుతున్నారు. ఇక్కడ కాసులిస్తే ఏపనైనా చేస్తారనడంలో సందేహం లేదు. ఇందుకు ప్రత్యేకంగా కొన్ని కార్యాలయాలలోకి వెళ్లి చూస్తే విషయం అర్థమవుతోంది. నిరుపేదలను ఆసరా చేసుకొని కొందరు దళారులు సంఘాల పేరు చేప్తూ కార్యాలయాల్లో హవా నడిపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు కార్యాలయ సిబ్బంది కూడా సహకరిస్తున్నట్లు సమాచారం.

గద్వాల క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జోగుళాం బ గద్వాల జిల్లా కేంద్రంలోని కార్మికశాఖలో కాసులిస్తే కార్మికులు కాకున్నా లేబర్ కార్డులు జారీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ లేబర్ కార్డులు అంగ ట్లో వస్తువులుగా మారాయి. కొందరు యూనియన్ నా యకులు దళారుల ముసుగులో వారు చెప్పితేనే కార్డు లు ఇవ్వాలనేలా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కార్మికులు కానివారు కూడా లేబర్ కార్డులు తీసుకొని ప్రభుత్వం అందించే సౌకర్యాలు పొందుతున్నారు. జిల్లాలో 2009 నుంచి మొదలుకొని ఇప్పటి వరకు మొత్తం భవన నిర్మాణ కార్మికులు 73,151 మంది ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో కార్మికులు కానివారు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం అందించే పథకాలు 9,367 మంది లబ్ధిపొందారు. ఇందులో కూడా మెటర్నిటీకి సంబంధించి 6,410 మంది, పెళ్లిళ్లకు సంబంధించి 2,267 మంది, సాధారణ మరణాలకు సంబంధించి 637 మంది, ప్రమాదాలకు సంబంధించి 48 మంది, దివ్యాంగులకు సంబంధించి ఐదుగురు లబ్ధిపొందారు. వీరికి మొత్తం క్లైమ్ రూపంలో రూ. 37,25,39,324 మంజూరు చేశారు. 170 మందికి

- మిగతా 6వ పేజీలో...

తెల్లబోయిన పత్తి రైతు

- ప్రారంభం కాని సీసీఐ కొనుగోలు కేంద్రాలు
- దక్కని మద్దతు ధర
- మిల్లుల దగ్గర బారులు తీరుతున్న పత్తి వాహనాలు


అప్పక్‌పల్లి మిల్లు దగ్గర మెడికల్ కళాశాల మార్గంలో బారులు తీరిన పత్తి వాహనాలు

నారాయణపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో పత్తికి ధరలు రాక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో మిల్లుల వద్ద పత్తి లోడ్‌లతో వాహనాలు బారులు తీరుతున్నాయి. జిల్లాలో ఈ వానాకాలంలో 1,65,150 ఎకరాల్లో పత్తి సాగు చెయ్యగా, 9,90,900 పత్తిని కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ప్రభుత్వం సీసీఐ ఆధ్వర్యంలో ఏడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించినా.. ఏర్పాటు చేయలేదు. అధిక వర్షాలతో పాటు తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు. అయినా మద్దతు ధర రావడం లేదని అంటున్నారు. క్వింటాల్‌కు ధర కనిష్ఠంగా రూ.5,500 నుంచి గరిష్ఠంగా రూ.7,300 వరకు ఉండగా, రమారమిగా రూ.6,500 ఉందని రైతులు చెబుతున్నారు. వర్షాల వల్ల పత్తి తేమ అధికంగా 30 నుంచి 40 శాతం వస్తుందని, అందుకే ధరలు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం తేమ 12 శాతానికి మించకుండా ఉంటేనే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రూ.7,521 ధర అందుతుందని అంటున్నారు.


నారాయణపేటలో వర్షానికి తడిసిన పత్తి

82,117.18 క్వింటాళ్లు కొనుగోలు

నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ప్రైవేటు మిల్లర్లు ఇప్పటి వరకు 82,117.18 క్వింటాళ్ల పత్తిని కొనుగులు చేశారు. కనిష్ఠంగా రూ.5,500, గరిష్ఠంగా రూ.7,300, రమారమి రూ.6,500 ధర పలికింది. మక్తల్ వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో మిల్లర్లు ఇప్పటి వరకు 6,184 క్వింటాళ్ల కొనుగోలు చేయగా.. కనిష్ఠంగా రూ.5,500, గరిష్ఠంగా రూ.7,100 ధర పలికింది.

వాహనాల బారులు

జిల్లాలోని త్రిస్‌పల్లి, అప్పక్‌పలి, లింగంపల్లి మిల్లుల వద్ద పత్తి వాహనాలు అధిక సంఖ్యలో బారులు తీరుతున్నాయి. ఆటోలు, బొలెరో, ట్రాక్టర్లలో పత్తిని తెచ్చిన రైతులు రేయింబవళ్లు పడిగాపులు కాసి, వచ్చిన ధరకే అమ్ముకుంటున్నారు. తిప్రస్‌పల్లి మిల్లు దగ్గర మక్తల్-నారాయణపేట రోడ్డు అంచున పత్తిలోడ్ వాహనాలు ఆపడంపై పోలీసులు అభ్యంతరం చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

కర్ణాటకకు తరలుతున్న పత్తి

మక్తల్ నియోజకవర్గ రైతులు సరిహద్దులో ఉన్న రాయిచూర్‌కు పత్తిని తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. రాయిచూర్ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర కనిష్ఠంగా రూ.6,800 నుంచి గరిష్ఠంగా రూ.8,000 ధర ఉండటంతో అక్కడికి తరలించి అమ్ముకుంటున్నారు.

న్యూస్ బాక్స్

ఎంఈవో సస్పెన్షన్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగానికి పాల్పడినందుకు భూత్పూర్ ఎంఈవోను సస్పెం డ్ చేస్తూ ఆర్జేడీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో రవీందర్ తెలిపారు. గతంలో వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్ మండలంలో జీహెచ్‌ఎంగా పని చేసిన ఉషారాణి గత ఏడాది సెప్టెంబరులో స్పౌజ్ పాయింట్లు ఉపయోగించుకొని బదిలీపై మహబూబ్‌నగర్ జిల్లా పోతులమడుగు జడ్పీహెచ్‌ఎస్‌కు బదిలీపై వచ్చారు. ఆమెకు ఇటీవల భూత్పూర్ మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు ఇచ్చారు. స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంలో ఆమెను ఆర్జేడీ సస్పెండ్ చేశారు.

ముమ్మరంగా సోమశిల హైవే పనులు

- ఐదు విభాగాల్లో ఎన్‌హెచ్167కే నిర్మాణం
- మొదటి విడతలో 79కిలో మీటర్లకు గాను 49 కిలో మీటర్ల బీటీ పూర్తి

కల్వకుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొట్ర గేటు నుంచి నంద్యాల జాతీయ రహదారి 167కే నిర్మాణ పనులు ముమ్మరంగా సాగు తున్నాయి. మొత్తం ఐదు విభాగాల్లో పనులు జరుగుతున్నా యి. రాష్ట్రంలో మొదటి విభాగం లో కొట్ర గేటు నుంచి సోమశిల వరకు ఉండగా.. రెండో విభాగంలో సోమశిల వంతెన అప్రోచ్, మూడో విభాగం తీగల వంతెన ఉండగా, మిగతా నాలుగు, ఐదు విభాగాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. మొదటి విభాగంలో కొట్ర గేటు నుంచి సోమశిల వరకు రూ.401 కోట్లతో 79.3కిలో మీటర్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు ముమ్మరంగా కొన సాగుతున్నాయి. అందులో 49కిలో మీటర్ల వరకు 100ఎంఎం బీటీ పూర్తి కాగా ఫైనల్ పనులు జరగాల్సి ఉంది.

ఎన్‌హెచ్ 167కే లో మూడు బైపాస్‌లు

కొట్ర గేటు సోమశిల ఎన్‌హెచ్ 167లో భాగంగా కల్వకుర్తి బైపాస్ 10.5కిలో మీటర్లు, నాగర్‌కర్నూల్ బైపాస్ 11కిలో మీటర్లు, కొల్లా పూర్ బైపాస్ నాలుగు - మిగతా 6వ పేజీలో..


కొనసాగుతున్న ఎన్‌హెచ్167కే జాతీయ రహదారి పనులు

దరఖాస్తు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో వాచ్‌మెన్, కుక్, ఎలక్ట్రీషియన్-ప్లంబర్ , క్యాంటీన్ అసిస్టెంట్, కిచెన్ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రాంతీయ సమన్వయ అధికారి కల్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గిరిజనం సర్కార్ చదువుకు దూరం

- తండాల్లో మూత పడుతున్న పాఠశాలలు
- ప్రైవేట్ పాఠశాలల్లో చేరక తప్పని పరిస్థితి
- ఫీజులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న తల్లిదండ్రులు



దొంతికుంట తండాలో మూతపడిన ప్రాథమిక పాఠశాల

ఖిల్లాఘణపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గిరిజన తండాల్లోని ప్రభుత్వ పాఠశాలలు ఒకొక్కకటిగా మూతప డుతున్నాయి. విద్యార్థులు లేకపోవడంతో వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 31 ప్రాథమిక పాఠశా లలు మూతపడ్డాయి. జిల్లా వ్యాప్తంగా 6,665 మంది ఎస్టీ విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిలో ప్రభుత్వ పాఠశాలలో 4,770 మంది ఉన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 1,895 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే ప్రీ ప్రైమరీ తరగతుల విద్యార్థుల పేర్లను యూడైస్‌లో నమోదు చేస్తే ఈ సంఖ్య పెరిగే అవకాశముంది. ప్రాథమిక పాఠశాలల్లో ఎస్టీ విద్యార్థులు 2,298 మంది ఉండగా, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1683 మంది చదువుకుం టున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 615 మంది ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నట్లు ఆన్‌లైన్ ఎన్ రోల్‌మెంట్‌లో నమోదై ఉంది. కానీ అనధికారి కంగా దాదాపు వెయ్యి మందికి పైగా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక విద్యను చదువుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఒక్క ఖిల్లాఘణ పురం మండలంలోనే 287 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఉన్నారు. 140 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నట్లు యూడైస్ లెక్కల ప్రకారం తెలు స్తోంది. వానీ వాస్తవానికి ప్రభుత్వ బడుల్లో చేరే ఎస్టీ విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతుండగా, ప్రైవేటు పాఠశాలల్లో చేరే వారి సంఖ్య పెరు గుతోంది. అందుకు అనేక కారణాలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయుల కొరత ప్రధాన కారణం కాగా, మౌలిక వసతులు లేకపోవడం మరో కారణమని తెలుస్తోంది. ఈ క్రమంలో విద్యార్థులు లేని పాఠశాలలను ప్రభుత్వం మూసి వేస్తోంది. వాటిలో రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన నేల బండ తండా పాఠశాల కూడా మూతప డటం గమనార్హం. ఈ పాఠశాలలో 2002 నుంచి 2009 వరకు ఉపాధ్యాయుడిగా నరేందర్ పని చేశారు. ఆయన లంబాడీ భాష నేర్చుకొని, పాఠ్యాంశాలను వారి భాషలోనే బోధించి బడికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. అలాంటి పాఠశాల కూడా మూతపడటంతో ఆవేదన వ్యక్తం అవు తోంది.

మండలాల వారీగా తండాల్లో..

జిల్లాలోని గిరిజన తండాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు అధికంగా ఉన్నాయి. ఆ పాఠశాలల్లో 10 మంది విద్యార్థులున్నా, ఐదు తరగతుల వరకు ఉండడంతో ఒకే ఉపాధ్యాయుడు అన్ని సబ్జెక్టులను బోధిం చడం ఇబ్బందిగా మారింది. దీంతో విద్యార్థులకు తగిన న్యాయం చేయలేకపోతున్నారు. ఉన్న ఉపాధ్యాయుడు కూడా కాంప్లెక్స్ మీటింగ్ ఉన్నప్పుడు, అనారోగ్యం, ఇతర సమస్యలున్న ప్పుడు విద్యాబోధన సాగడం లేదు. తండాల్లోని పలు పాఠశా లల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టగానే ఉపాధ్యా యులు వెళ్లిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు ప్రధాన రహదారులకు పాఠశాలలు దూరంగా ఉండటం, రెగ్యులర్ ఎంఈవోలు లేకపో వడం విద్యార్థుల సంఖ్య తగ్గేందుకు కార ణంగా తెలుస్తోంది.

నామమాత్రపు సౌకర్యాలతో అవస్థలు

తండాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతు న్నారు. తాగునీరు అందుబాటులో ఉండటం లేదు. వంట గదులు, ప్రహరీలు లేవు. మరుగు దొడ్లు లేక ఒకటికి, రెంటికి విద్యార్థులు ఆరుబ యటకు వెళ్లాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు - మన బడి పథకాన్ని ప్రవేశ పెట్టి, పాఠశాలల్లో పనులు చేపట్టారు. కానీ చాలా చోట్ల పనులను అర్ధాంతరంగా నిలిచి పోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం పేరుతో బడుల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఆ పనులు కొనసాగుతున్నాయి. అలాగే బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా పెద్దగా ఫలితం కనిపించడం లేదు. ప్రభుత్వ పాఠ శాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. అలాగే ఉపాధ్యాయుల సంఖ్యను పెంచి, బోధన సక్రమంగా సాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. అప్పుడే సర్కార్ బడులపై నమ్మకం కలిగి, విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల భారం

రాములు నాయక్, నేలబండ తండా : తండాల్లో పాఠశాలలు మూతపడటంతో పిల్లలను ప్రైవేట్ బడుల్లో చేర్పించక తప్పడం లేదు. ప్రభుత్వ పాఠశాలలు ఉన్న చోట కూడా ఒకరే ఉపాధ్యాయుడు ఉండటంతో బోధన సరిగా ఉండటం లేదు. తండాలు ప్రధాన రహదారు లకు దూరంగా ఉండటంతో ఇక్కడి పాఠశాలలపై పర్యవేక్షణ కరువ య్యింది. మౌలిక వసతులు లేవు. ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తుం డటంతో ఆర్థిక భారం తప్పడం లేదు.


ఖిల్లాఘణపురం మండలం నేలబండ తండాలో పిచ్చి మొక్కల మధ్య ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

న్యాక్ 'ఏ' గ్రేడ్ లక్ష్యం

- పీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీకి న్యాక్ 'ఏ' గ్రేడ్ సాధించేందుకు కృషి చేస్తామని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీని వాస్ అన్నారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

పీయూ వీసీగా వచ్చిన మొదటి రోజు ఎలా అనిపించింది?

నేను బాధ్యతలు చేపట్టాక తరగతి గదులు, ల్యాబ్, హాస్టల్స్, లైబ్రరీ, ఫార్మసీ కళాశాలను పరిశీలించాను. ఇక్క డ అన్ని వసతులూ ఉన్నాయి. సైన్స్ విభాగాల ల్యాబ్, క్లాసులు అన్నీ బాగున్నాయి. రెగ్యులర్ అధ్యాపకుల కంటే కాంట్రాక్ట్ అధ్యాపకులు ఎక్కువగా ఉన్నారు. కానీ అందరు ఎక్కువ అర్హతలు కలిగి ఉన్నారు. ఇది చాలా మంచి విషయం. విద్యార్థులు కూడా తరగతులకు బాగా హాజరవుతున్నారు. విద్యార్థులను ఎక్కు వగా లైబ్రరీలో చుశాను. కెరియర్‌పై ఎక్కు వగా దృష్టితో ముందుకు వెళ్లడం మంచి విషయం.

వీసీగా వర్సిటీ అభివృద్ధికి ఏమేం లక్ష్యాలు నిర్దేశించుకున్నారు?

వర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులను పెంచుతాం. పరిశ్రమల అవసరాలకు అనుగు ణంగా విద్యార్థులను తయారు చేసి, స్థిరప డేలా చూస్తాం. చదువుతో పాటు సంస్కారం, పద్ధతులు నేర్పుతాం. ఓవరాల్‌గా ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్, న్యూమరికల్ ఎబిలిటీ, మెంటల్ ఎబిలిటీ, లిడర్‌షిప్ క్వాలిటీస్, ఆర్గనై జేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి, సొసైటీకి ఉపయో గపడేలా విద్యార్థులను తీర్చిదిద్దుతాం.

నాన్ టీచింగ్ ఉద్యోగులు చాలా కాలంగా తాత్కాలిక పద్ధతిలో పని చేస్తు న్నారు. వేతనాలు తక్కువగా ఉన్నాయి. ఉద్యోగ భద్రత లేదు. వారి సమస్యలు పరిష్కరించే అవకాశం ఉందా?

వర్సిటీలో పని చేస్తున్న అధ్యాపకులు, నాన్ టీచింగ్ రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న వారి వివరాలను తీసు కుంటాం. వారి ఫైల్ పరిశీలించి, నా స్థాయిలో జరిగేవి ఉంటే వెంటనే పరిష్కరిస్తా. మిగతావి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.

కొత్త పీజీ సెంటర్లను ఏర్పాటు చేస్తారా?

వర్సిటీకి అనుబంధంగా వనపర్తి, జోగు ళాంబ గద్వాల, కొల్లాపూర్‌లలో పీజీ సెంటర్లు ఉన్నాయని అధికారులు చెప్పారు. కొత్తగా పీజీ సెంటర్లను ఏర్పాటు చేయము. కానీ ప్రస్తుతం ఉన్న సెంటర్లలో విద్యా ప్రమాణాలను పెంచుతాం. విద్యార్థులకు హాస్టల్ వసతి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం. వాటిని మరింత అభివద్ధి చేస్తాం.

నిధుల కొరతను ఎలా అధిగమిస్తారు?

పాలమూరు యూనివర్సిటీకి నిధులు తక్కువగా ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. ఇప్పటి వరకు వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలు తెలుసుకుంటా. ఈ సారి ప్రభుత్వం నుంచి ఎక్కువ నిధులు వస్తా యని ఆశిస్తున్నా.

జనరల్ ఆస్పత్రిపై కలెక్టర్ నజర్

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పతిని బాగు చేసేందుకు కలెక్టర్ చొరవ తీసుకుంటున్నారు. ఆస్పత్రిలో శానిటే షన్ వ్యవస్థ పూర్తిగా అధ్వానంగా మారిం దని, టెండరు దక్కించుకున్న ఏజెన్సీ నిర్వా హకులు తక్కువ మందిని నియమించి ఎక్కువ మంది ఉన్నట్లు బిల్లులు తీసుకుంటు న్నారని కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో బిల్లులు తీసుకోవడం తప్ప పని చేయడం లేదని గ్రహించిన కలెక్టర్ ఆస్ప త్రిపై నజర్ పెట్టారు. ఈమేరకు ఈనెల 18న ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సందర్భంగా శానిటేషన్ వ్యవస్థ అధ్వానంగా ఉందని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి ఇన్‌చార్జిగా అదనపు కలెక్టర్ శివేంద్ర పతాప్‌కు బాధ్యతలు అప్పగించారు. రోగు లకు మెరుగైన సేవలు అందుతున్నాయా?, డాక్టర్లు సకాలంలో వస్తున్నారా?, శానిటేషన్ వ్యవస్థ ఎలా కొనసాగుతుందనే అంశాలను పర్యవేక్షించేందుకు ఆయనకు బాధ్యతలు అప్పజెప్పారు. ఆస్పత్రిని సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.

సూపర్‌వైజర్ల తొలగింపు

శ్రీసాయి ఏజెన్సీ నిర్వాహకులు ఆస్పత్రిలో శానిటేషన్‌ను పర్యవేక్షించేందుకు 15 మంది వరకు సూపర్‌వైజర్లను నియమించారు. అయితే వీరు కూడా ఏజెన్సీకి చెందిన వారే కావడంతో తక్కువ మంది వచ్చినా ఎక్కువ మంది చూపిస్తున్నారనే ఆరోపణలు వీరిపై ఉన్నాయి. దాంతో ఆ సూపర్‌వైజర్లను తొల గించి, శానిటేషన్ వ్యవస్థను పర్యవేక్షించేం దుకు ఒక సీహెచ్‌వో, ఆయన కింది స్థాయి అధికారులు హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు కలెక్టర్ బాధ్యతలు అప్పజెప్పారు. వారు రోజూ స్వయంగా ఆస్పత్రిలోని అన్ని వార్డుల్లో తిరిగి, ఎక్కడ అధ్వానంగా ఉందో తెలుసుకొని కార్మి కులతో పని చేయించుకోవాలని చెప్పారు.

వాట్సాప్ గ్రూపు ద్వారా పర్యవేక్షణ

ఆస్పత్రిలో శానిటేషన్ కోసం కలెక్టర్ ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేయించారు. రోజూ వార్డుల్లో శుభ్రత, పరిశుభ్రత, కార్మి కుల హాజరు వంటి అంశాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రతీ రోజు వార్డుల పొటోలు, పని చేస్తున్న వారి వివరాలను హెల్త్ ఇన్‌స్పెక్టర్ల ద్వారా గ్రూపులో అప్‌లోడ్ చేయిస్తున్నారు. ఏదైనా పొరపాట్లు ఉంటే ఆ గ్రూపులోనే సలహాలు, సూచనలు చేస్తు న్నారు. శానిటేషన్ కార్మికుల హాజరు కోసం బయోమెట్రిక్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయించారు. బయోమెట్రిక్ హాజరు ద్వారానే వారికి బిల్లులు చేయాలని కచ్చితమైన ఆదే శాలు జారీ చేశారు.

కలెక్టర్ చొరవతో ఆస్పత్రి అభివృద్ధి

జనరల్ ఆస్పత్రి అభివృద్ధి కోసం కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. శానిటేషన్ వ్యవహారం మాకు భారంగా ఉండేది. దాంతో ఆస్పత్రికి చాలా చెడ్డపేరు వస్తోంది. అందుకే కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఆస్పత్రి పరిసరాలు, వార్డులు, విభాగాలు చాలా పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. భవిష్య త్తులో డాక్టర్ల పనితీరు, రోగులకు అందు తున్న వైద్య సేవలను కూడా కలెక్టర్ పర్యవే క్షించనున్నారు.

- డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

ముగిసిన ఏఆర్‌టీ పోస్టుల అభ్యర్థుల ఎంపిక

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జనరల్ ఆసుపత్రిలోని ఏఆ ర్‌టీ సెంటర్‌లో పలు పోస్టులకు సంబంధించి మంగళవారం ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. ఇంటర్వ్యూలు నిర్వహించిన అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈనెల 18న ల్యాబ్ టెక్నీషియ న్, స్టాఫ్‌నర్సు, కౌన్సిలర్ పోస్టులకు రాత పరీక్ష నిర్వహించారు. అయితే కౌన్సిలర్ పోస్టుకు సంబంధించి రాత పరీక్షలో కొంత గందరగోళం నెలకొంది. ఒక అభ్యర్థికి మార్కులు ఎక్కువగా రావడం, ఆ అభ్యర్థికి సంబంధించిన వారు ఆసుపత్రిలోనే పనిచేస్తుండడంతో పరీక్ష పేపర్ లీకయ్యిందనే అనుమానం వచ్చింది. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆ ఒక్క పోస్టుకు సంబంధించిన అభ్యర్థులు 24మందికి మళ్లీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన వారికి, మిగతా పోస్టుల అభ్యర్థులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శశికాంత్, ఏఆర్‌టీ నోడల్ ఆఫీసర్ డా. బాలశ్రీనివాస్ ఇంటర్వ్యూలు నిర్వహిం చారు. ఇందులో ప్రతిభ కనబరిచిన అభ్యర్థు లను ఎంపిక చేశారు. ఇదిలా ఉండగా మెరిట్ లిస్టు వేయకుండా అభ్యర్థులను ఎలా ఎంపిక చేస్తారని, కౌన్సిలర్ పోస్టు ఎంపికలో అవకతవ కలు ఉన్నాయని ఏబీవీపీ నాయకులు సూప రింటెండెంట్‌ను కలిశారు. తాము ఎలా ఎంపిక చేశామనే విషయంపై క్షుణ్ణంగా తెలియజేయ డంతో వారు వెళ్లిపోయారు.

నల్లబారిన పత్తి

- నష్టపోయిన పత్తి రైతులు
- అధిక వర్షాలకు దెబ్బతిన్నపంట
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి


వర్షం కారణంగా జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు పొలం వద్ద నల్లగా మారిన పత్తి

అమ్రాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరుసగా కురుస్తున్న వానలకు పత్తిపంట దెబ్బతిన్నది. పత్తి నల్లగామారడంతో ధర తగ్గు తుదని రైతులు దిగులు చెందుతున్నారు. మం డల పరిధిలో సుమారుగా 19వేల ఎకరాలలో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ నుంచి వర్షాలు మోస్తరుగా కురిసినప్పటికీ పత్తి పంట దిగుబడి బాగానే వస్తుందని రైతులు భావిం చారు. పంట చేతికి అందిన ప్రస్తుత దశలో 20 రోజుల నుంచి వరుసగా వర్షం కురుస్తుండ డంతో మెజార్టీ రైతులు ఇప్పటి వరకు పత్తి తీయకపోవడంతో పెద్దఎత్తున నష్టం వాటిల్లిం ది. ఆయా గ్రామాల్లో (10 శాతం మంది) రైతులు తీసినప్పటికీ విపరీతమైన వర్షాల కారణంగా తేమ శాతం ఎక్కువై పొలాలలో, ఇళ్లలో ఉన్న పత్తి కూడా దెబ్బ తిన్నది. ఈ పరిస్థితిలో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా క్షేత్రస్థాయి అధ్యయనం చేయించి రైతుల కు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని మండల కేంద్రానికి చెందిన కంచర్ల గుండెలు అనే రైతుతో పాటు వివిధ గ్రామాల రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దాడి కేసులో వ్యక్తి రిమాండ్

ఖిల్లాఘణపురం/అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఖిల్లాగణపురం ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నా యి. వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం లోని మానాజీపేట మాజీ సర్పంచ్ సతీష్‌పై రాజనాల బాలరాజు, ఆంజనేయులు అనే వ్యక్తులు దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మంగ ళవారం రాజ నాల బాలరాజును అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి ఆదే శం మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇదే కేసులో ఏ2 నిందితుడు ఆంజ నేయులును రెండు రోజుల క్రితం రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కాసులిస్తేనే కార్డు!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన క్లైమ్స్ పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

దళారులే రాజ్యమేలుతున్నారా?

జిల్లా కేంద్రంలోని కార్మికశాఖ కార్యాలయంలో అధికారులు సమయానికి వస్తారో లేదో కానీ అక్కడ నిత్యం కనపడేది దళారులే. కార్మికులు కానివారితో ఒక్కో కార్డుకు రూ. 800 నుంచి రూ. 1000 తీసుకువచ్చి మేము పలానా సంఘం నాయకులమని చెప్పుకొని కార్డులు జారీ చేయి స్తున్నారు. ఇందులో రూ. 200 నుంచి రూ. 300 వరకు కార్యాలయ సిబ్బందికి ముట్టజెపుతున్నా రనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లేబర్ కార్డుతో పాటు బీమా సొమ్ము క్లైయిమ్‌కు ఒక్కో ధర నిర్ణయించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోప ణలు వినిపిస్తున్నాయి. ఇలా లేబర్ కార్డు ఉన్న వారికి ప్రభుత్వం నుంచి ప్రమాద బీమా రూ. 6 లక్షలు, సాధారణ మరణానికి రూ. 1.30లక్షలు ఇలా వచ్చే పథకాలలో దళారులు చేతివాటం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా లేబర్ కార్డులు తీసుకున్న వారిలో అధికంగా అనర్హులు ఉన్నట్లు సమాచారం. ఈ తతంగం అంతా లేబర్ కార్యాలయంలో పనిచేసే ఓ సిబ్బంది హస్తం కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

శిథిలావస్థ భవనంలోనే కార్యాలయం

జిల్లా కేంద్రంలో అన్ని హంగులతో ఏర్పాటు చేసిన ఐడీవోసీ కార్యాలయంలోకి లేబర్ కార్యాల యాన్ని మార్చకుండా శిథిలావస్థలో ఉన్న భవ నంలోనే ఎందుకు నిర్వహిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. నూతన కార్యాలయంలోకి అధికా రులు సమయపాలన పాటించాల్సివస్తుందని, దళారులు తగ్గుతారనే పాత భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి.

ముడుపుల విషయం తమ దృష్టికి వచ్చింది



కార్మికుల నుంచి కార్డుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చింది. కార్మికులు ఎవరిని ఆశ్రయించకుండా నేరుగా తమ దగ్గరకు వచ్చి కార్డులను తీసుకెళ్లాలని ఆదేశాలు జారీ చేశాం. కొందరు యూ నియన్ నాయకులు తమకు సంబంధించిన వారని వస్తుంటారు. డబ్బులు తీసుకునే వారిపై చర్యలు తీసు కుంటాం. నూతన భవనంలోకి మార్చే విషయం జిల్లా లేబర్ అధికారి ఆధీనంలో ఉంటుంది.

- వేణుగోపాల్, అసిస్టెంట్ లేబర్ అధికారి


నూతన లేబర్ కార్డులను ఎంట్రీ చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ నిషాంత్

ముమ్మరంగా సోమశిల హైవే పనులు


సుద్దకల్ దుందుభీ నదిపై జరుగుతున్న మేజర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

కిలో మీటర్లు ఉంది. కాగా కల్వ కుర్తి బైపాస్ పనులు జరుగుతున్నాయి. కొల్లాపూర్ బైపాస్ నిర్మాణానికి భూ సేకరణ జరగగా నాగర్ కర్నూల్ బైపాస్ నిర్మాణానికి భూసేకరణ జరగ లేదు. దీంతో అక్కడ పనులు ప్రారంభం కాలేదు. కల్వకుర్తి మండలం సుద్దకల్ సమీపంలో దుందుభీ నదిపై మేజర్ బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నాయి. నాగర్‌కర్నూల్ బైపాస్ వద్ద మేజర్ బ్రిడ్జి నిర్మాణం పనులు భూసేకరణ లేకపోవడంతో ప్రారంభం కాలేదు. ఎన్‌హెచ్ 167కే లో మైనర్ బ్రిడ్జిలు 12, స్లాబ్ కల్వర్టులు 9, పైపు కల్వర్టులు 22 ఉండగా వెహికిల్ అండర్‌పాస్‌లు నాలుగు ఉన్నాయి. అందులో కల్వకుర్తి-1, నాగర్ కర్నూల్-1, కొల్లాపూర్-2 నిర్మాణాలు జరగాల్సి ఉంది. బీటీ రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తి కావస్తుండడంతో రాకపోకలకు ఇబ్బంది తప్పుతుం దని ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు అభిప్రా యపడు తున్నారు.

జూలై 2025 వరకు పూర్తి చేస్తాం



ఎన్‌హెచ్ 167కే లో 79.3కిలో మీటర్లల్లో ఇప్ప టికే 49కిలో మీటర్ల బీటీ నిర్మాణం పూర్తైంది. పను లు సకాలంలో నాణ్యతగా జరిగేలా చూస్తున్నాం. జూలై 2025లోపు రోడ్డు నిర్మాణం పూర్తవుతుంది. నాగర్‌కర్నూల్ బై పాస్ వద్ద భూసేకరణ కోసం ప్రాసెస్ కొనసాగుతోంది.

- రాజేందర్, జాతీయ రహదారుల ఈఈ

రోడ్డెక్కిన విద్యార్థులు

- మౌలిక వసతులు కల్పించాలని బైఠాయింపు

వనపర్తి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ ఇం జనీరింగ్ కళాశాల విద్యార్థులు మంగళవారం రోడ్డెక్కారు. కనీస వసతులు కల్పించడం లేదని కళాశాలకు సమీపంలోని ప్రధాన రోడ్డుపై బైఠా యించి ఆందోళన చేశారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మూడేళ్ల క్రితం వన పర్తి జిల్లా కేంద్రంలోని నర్సింగాయపల్లి దగ్గర ఇంజనీ రింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఈ కళాశాలలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 700 మంది విద్యార్థులు చదువుకుంటు న్నారు. కానీ, కనీస వసతులు, నాణ్యమైన ఆహారం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతూ ప్రైకోర్సులకు నెట్టుకొస్తున్నారు. సరిపడా భవనం లేక విద్యార్థు లతో కిక్కిరిసిపోవడంతో రెండు నెలల కిందట వనపర్తి పట్టణంలోని ఓ పాత హాస్పిటల్‌ను బాలికల హాస్టల్‌గా, అక్కడే దగ్గ రలో గల జిమ్ము ను బాయ్స్ హాస్టల్‌గా మార్చారు. కానీ, హాస్టళ్లలో మౌలిక వసతులు లేవు, ఒక్కో గదిలో ఏడు, ఎనిమిది మందిని ఉంచుతున్నారు. భోజనం నాణ్యతగా లేకుండా నీళ్ల చారు పోస్తున్నారని, అన్నం, సాంబార్, పప్పులో బొద్దింకలు, వెం ట్రుకలు కనబ డుతు న్నాయని, ప్రిన్సిపాల్‌కు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని రోడ్డుపై బైఠా యించిన విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. కలెక్టర్ వచ్చి సమస్యలను పరిష్కరించేవరకు ఆందోళన విర మించేదిలేదని విద్యార్థులు భీష్మిం చి కూర్చు న్నారు. ఆందోళనకు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అర్జు న్, నాయకులు బాలకృష్ణ, బీజేపీ పట్టణ అధ్య క్షుడు బచ్చురాం మద్దతు పలికారు. ఆర్డీవో పద్మావతి వచ్చి సమస్యలను అధికారులతో మాట్లాడి వారం పది రోజుల్లో పరిష్కరించేం దుకు కృషి చేస్తానని చెప్పడంతో శాంతించారు.


జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని రహదారిపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ముగ్గురు యువకులకు శిరోముండనం ఘటనతో ఎస్ఐపై బదిలీ వేటు

లింగాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు యువకుల శిరోముండనం ఘటన తో నాగర్‌కర్నూలు జిల్లా లింగాల ఎస్ఐ జగన్మోహన్‌పై బదిలీ వేటు పడింది. లింగాల మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువ కులు ఈనెల 13న ఓ పెట్రోల్ బంకులో ని ర్వాహకులపై దాడి జరిపిన సంఘటన విది తమే. 14న పెట్రోల్ బంకు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురు యువకులకు పోలీసులు స్టేషన్‌కు రప్పించి వివిధ రకాలు గా వేధింపులకు గురి చేశారు. ఎస్ఐ జగన్మో హన్ సమక్షంలో గుండు గీయించి మూడు రోజుల పాటు స్టేషన్‌లోనే ఉంచుకొని వారి తో పలు రకాల పనులు చేయించారు. కాగా ముగ్గురు యువకులలో ఒకరైన గోపిశెట్టి వినీత్ శిరోముండనం చేయించడం అవమా నకరంగా భావించి ఈ నెల 18న ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్ప డ్డాడు. ఆ యువకుడిని కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ సంఘటనలో పోలీ సుల తీరుపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. దీంతో పోలీసు ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. యువకులకు శిరోముండ నం చేయించిన ఎస్ఐపై బదిలీ వేటు వేస్తూ మంగళవారం జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎస్ఐని వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయానికి వీఆర్‌తో అటాచ్ చేసి నట్లు అచ్చంపేట సీఐ రవీందర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన నల్లమల విద్యార్థి

అమ్రాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం టీకే తిరుమలాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి ఎడ్ల వరప్రసాద్ వర్మ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టీంకు ఎన్నికయ్యాడు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వాలీబాల్ అండర్ 17 టీంకు ఎంపికయ్యాడు. త్వరలోనే గోదా వరి ఖనిలో జరగను న్న వాలీబాల్ పో టీలకు ఎంపికయ్యా డు. ప్రస్తుతం వరప్ర సాద్ లింగాల సాం ఘిక సంక్షేమ గురుకు ల విద్యాల యంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదు వుతూ అచ్చంపేట వాలీబాల్ అకాడమీ కోచ్ శివ ప్రోత్సాహంతో ఈ విద్యార్థి వాలీబాల్‌క్రీడలో రాణిస్తున్నాడు. వరప్రసాద్ రాష్ట్రస్థా యి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడం పట్ల టీకే తిరుమలాపూర్ గ్రామస్థులతో పాటు అమ్రాబాద్ మండలం లోని వివిధ గ్రామాల క్రీడాకారులు అభి మానులు హర్షం వ్యక్తం చేశారు.


వరప్రసాద్

క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్ యువకుడి మృతి

కృష్ణ, అక్టోబరు, 22 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. నారాయణపేట జిల్లా కృష్ణ మండలం, గుడెబల్లూరు శివారులోని 167వ జాతీయ రహదారి పైనున్న చెక్‌పోస్టు వద్ద మంగళవారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. ఏఎస్‌ఐ కతలప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాగనూరు మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మంగలి చంద్రశేఖర్ (36) ద్విచక్ర వాహనంపై వస్తూ, ఆర్‌టీఏ చెక్ పోస్టు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

బంగారం, నగదు చోరీ

తెలకపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని రాకొండకి చెందిన కొట్టె మల్లయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు, నగదును ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ బి.నరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్లయ్య మంగళవారం మధ్యాహ్నం భార్య రజితతో కలిసి కూరగాయలు తెచ్చేందుకు తెలకపల్లికి వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వచ్చే సరికి ఇంటికి వేసిన తాళం విరిగిపడి ఉంది. ఆందోళన చెందిన వారు ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. అందులోని రూ. 15 వేలు, రెండు మాసాల కమ్మలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్‌కు గాయాలు

చారకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ లైన్‌మన్ తీవ్రంగా గాయపడ్డాడు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల పరిధిలోని జూపల్లిలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. లైన్‌మన్ ఆయూబ్‌ఖాన్ ఎల్‌సీ తీసుకొని విద్యుత్ స్తంభంపైకి ఎక్కి మరమ్మతు చేస్తున్నాడు. అదే సమయంలో మరో వ్యక్తి లింగారెడ్డిపల్లి లైన్‌కు ఎల్‌సీ తీసుకొని మరమ్మతు చేస్తున్నాడు. ఆయన పని పూర్తి కావడంతో ఎల్‌సీ క్లియర్ చేయించాడు. దీంతో సంభంపైనే ఉన్న లైన్‌మెన్ ఆయూబ్‌ఖాన్ విద్యుదాఘాతానికి గురై కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు విద్యుత్ శాఖ అధికారులు అతడిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

పత్తి చేనులో పని చేస్తున్న బాల కార్మికులకు విముక్తి

తెలకపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పత్తి చేనులో పని చేస్తున్న బాల కార్మికులకు చైల్డ్ వెల్ఫేర్ సభ్యులు విముక్తి కల్పించారు. తెలకపల్లి మండలంలోని పర్వతాపూర్ శివారులోని జాంపల్లి మధుసూదన్‌రెడ్డికి చెందిన పొలంలో తనిఖీ లు నిర్వహించారు. అక్కడ ఇద్దరు బాలికలు, ఒక బాలుడు పని చేస్తున్నట్లు గుర్తించారు. వారిని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచారు. అనంతరం వారిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు చైల్డ్‌లైన్ కేసు వర్కర్ కవిత, కౌన్సెలర్ యశ్వంత్ తెలిపారు. 18 సంవత్సరాల లోపు వయసు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుల్ లవకుశన్, కోనేరు స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు, అసిస్టెంట్ కోఆర్డినేటర్లు శ్రీనివాస్ యాదవ్, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

పెద్ద వాగులోకి దూసుకెళ్లిన వాహనం



వాగులోనుంచి వెనక్కి వస్తున్న వాహనం

కొల్లాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని ముక్కిడిగుండం పెద్దవాగు వద్ద మంగళవారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముక్కిడిగుండం గ్రామానికి చెందిన కొందరు మొలచింతలపల్లి మీదుగా కొల్లాపూర్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కొల్లాపూర్ నుంచి నార్లాపూర్ వరకు బస్సులో వచ్చారు. అక్కడి నుండి కాలి నడకన ముక్కిడిగుండం పెద్దవాగు వద్దకు వచ్చారు. అక్కడే ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కంపెనీకి చెందిన బోలేరో వాహనంలో ఎక్కారు. వాగు దాటుతుండగా బోలేరో వాహనం ఒక్కసారిగా వరద నీటిలోకి దూసుకెళ్లింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా వాహనాన్ని వెనక్కి తీసుకురావడంతో ప్రమాదం తప్పింది.

SHIVA AGRI CLINIC

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులంటే ఇష్టం. సరైన అవగాహన లేక, మెళకువలు తెలియక వారు పడే కష్టాలు అతడిని కదిలించాయి. వారికి అండగా ఉండాలనుకున్నాడు. అగ్రికల్చర్ డిప్లొమా పూర్తి చేశాడు. ఆ తర్వాత పీజీ చేస్తూనే, వ్యవసాయదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేశారు. రైతుల కోసం యూట్యూబ్ చానల్ ప్రారంభించాడు. వ్యవసాయానికి సంబంధించిన వివిధ అంశాలపై వీడియోలు రూపొందించి పోస్టు చేస్తున్నాడు.. అతడే కల్వకుర్తి పట్టణానికి శివకుమార్. యూట్యూబర్‌గా అతడి లక్ష్యం, అనుభవాలు, ఆశయాలను 'ఆంధ్రజ్యోతి' తెలుసుకున్నది. ఆ వివరాలు మీ కోసం...

- కల్వకుర్తి టౌన్ (ఆంధ్రజ్యోతి)

రైతుల కోసం..
శివ అగ్రి క్లినిక్



తాడూర్ మండలంలో కాకర సాగు చేసిన రైతుతో మాట్లాడుతున్న శివ

- యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్న శివ
- వ్యవసాయదారులకు అండగా ఉండటమే లక్ష్యం
- వారికి అవసరమైన వీడియోల పోస్టింగ్
- యూట్యూబ్‌లో 2.08 లక్షల సబ్‌స్క్రైబర్లు
- ఇన్‌స్టాలో 1.22 లక్షలకు చేరిన ఫాలోవర్ల సంఖ్య

నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణానికి చెందిన శివకుమార్‌కు చిన్నతనం నుంచే వ్యవసాయం అంటే ఇష్టం. రైతులకు అండగా ఉండాలన్నది లక్ష్యం. అతడిని యూట్యూబ్ వైపు అడుగులు వేయించాయి. తన ఆశయాలకు అనుగుణంగా పదవ తరగతి తర్వాత అగ్రికల్చర్ డిప్లొమా పూర్తి చేశారు. అనంతరం పీజీ చేస్తూనే, వ్యవసాయదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేశారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాగులో మెళకువలపై రైతులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా 2020లో 'శివ అగ్రి క్లినిక్' పేరుతో యూట్యూబ్ ఛానల్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల్లో రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలు, సాగులో మెళకువలు, నష్టపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధునాతన వ్యవసాయ పరికరాలు.. ఇలా రైతులకు అవసరమైన వివిధ అంశాలపై వీడియోలు చేసి అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటివరకు అతడి ఛానల్‌లో 819 వీడియోలు అప్‌లోడ్ చేశారు. ప్రస్తుతం 2.08 లక్షల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్స్ సంఖ్య 1.22 లక్షలకు చేరింది. అతడి ఫేస్‌బుక్ పేజీని 72 వేల మంది అనుసరిస్తున్నారు.

రైతుల నుంచి మంచి స్పందన

సాగులో మెళకువలు, ఆధునిక వ్యవసాయ పరికరాలు, వ్యవసాయానికి అనుబంధంగా నిర్వహించే పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం తదితర అంశాలపై శివకుమార్ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలకు రైతుల నుంచి స్పందన వస్తోంది. రైతులకు మరింత మెరుగైన సమాచారాన్ని అందించేందుకు, కొత్త విషయాలను తెలుసుకునేందుకు మన రాష్ట్రంతో పాటు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో రైతులు సాధించిన విజయాలు, సాగులో వారు అనుసరిస్తున్న పద్ధతులు, అక్కడ పండే పంటలు, వాటిని మన ప్రాంతంలో పండించేందుకు అవసరమైన విషయాలు ఇలా వివిధ అంశాలపై వీడియోలు తీసి తన ఛానల్ ద్వారా రైతులకు అందిస్తున్నారు. తన వీడియోలను వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు అనుసరించి లబ్ధి పొందుతున్నారని ఆయన తెలిపారు. కొందరు తనకు ఫోన్ చేసి పంటల సాగులో సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారని చెప్పారు. అలాగే వ్యవసాయ కోర్సులు కోర్సులు చేసే వారు తన వీడియోలను ఫాలో అవుతున్నారని తెలిపారు.



వికారాబాద్ జిల్లాలో బ్రోకలి సాగు చేసిన రైతుతో శివ

రైతులకు మెరుగైన సేవలు

వ్యవసాయదారులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడమే నా లక్ష్యం. సాగులో సరైన అవగాహన లేక నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు యత్నిస్తున్నాను. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాను. దేశంలోని అన్ని ప్రాంతాల రైతులకు ఉపయోగ పడేలా వీడియోలు రూపొందిస్తున్నాను.

- శివకుమార్, యూట్యూబర్



శివను అభినందిస్తున్న వ్యవసాయశాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి (ఫైల్)

పోలీసు శాఖపై అవగాహన ఉండాలి

- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి
- పరేడ్ మైదానంలో 'ఓపెన్ హౌస్'

మహబూబ్‌నగర్, అక్టోబరు 22 : పోలీసు శాఖ నిర్వహణ, సిబ్బంది విధులు, ఉపయోగించే వాహనాలు, ఆయుధాలు, సాంకేతిక పరికరాల గురించి ప్రజలకు అవగాహన ఉండాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి అన్నారు. అందుకోసం ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్‌హౌస్‌ను ఆమె ప్రారంభిం చారు. పోలీసులు వినియోగించే ఆయుధాలపై ప్రజలు, విద్యార్థులకు వివరించారు. పోలీసు అమరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారు చేసిన సేవలను గుర్తు చేశారు. ఓపెన్‌హౌస్ లాంటి కార్యక్రమాలు యువతలో దేశభక్తిని పెంపొందిస్తాయని, పోలీసుశాఖపై అవగాహన పెంచేందుకు దోహదపడుతాయని చెప్పారు. అమరుల త్యాగాలను గుర్తించుకుని విధి నిర్వహణలో ముందుకు సాగాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏరాములు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

వివాహితను వేధించిన యువకుడికి
వారం రోజుల జైలు శిక్ష

- అడిషనల్ ఎస్పీ సీహెచ్.రామేశ్వర్

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వివాహితను వేధించిన ఓ యువకుడికి న్యాయాధికారి వారం రోజుల జైలు శిక్ష విధించారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారి, అదనపు ఎస్పీ సీహెచ్ రామేశ్వర్ మంగళవారం మీడియాకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణానికి చెందిన యువకుడు చౌడవోని సాయిరాం నాగర్‌కర్నూల్ మండలానికి చెందిన వివాహితను గత కొద్ది రోజులుగా వేధిస్తున్నాడు. వాటిని భరించలేక ఆమె షీటీమ్‌ను ఆశ్రయించింది. దీంతో షీటీం పోలీసులు విచారణ చేపట్టారు. సాయిరాం ఆమెను తరుచూ కొత్త నంబర్లతో లైంగిక వేధింపులకు గురి చేస్తున్నట్లు నిర్ధారించారు. ఏఎస్ఐ విజయలక్ష్మి ఆధ్వర్యంలో షీటీం సభ్యులు అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు. అనంతరం న్యాయస్థానంలో హాజరు పరిచారు. ద్వితీయ శ్రేణి న్యాయాధికారి రామయ్య అతడికి వారం రోజుల జైలు శిక్ష విధించారు.

సాయిరాంపై గతంలోను ఈవ్‌టీజింగ్ కేసు నమోదయ్యిందని, ఇది రెండవసారని అదనపు ఎస్పీ సీహెచ్ రామేశ్వర్ తెలిపారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేధింపులు ఎదురైతే వెంటనే షీటీమ్ 8712657676 నంబర్‌కు ఫోన్ చేయాలని మహిళలు, యువతులు, విద్యార్థినులకు సూచించారు.

'డబుల్ క్లైమ్'తో పరిహారం స్వాహా!

- హైకోర్టు డైరక్షన్స్‌తో కేసు నమోదు
- బాధ్యుడైన ఓ అధికారి పరారీ
- త్వరలోనే పూర్తి వివరాల వెల్లడి : సీఐ టంగుటూరి శ్రీను

గద్వాల క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ల్యాండ్ అక్విజేషన్ డబుల్ క్లైయిమ్ వ్యవహారం జోగుళాంబ గద్వాల జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ కుంభకోణంలో సూత్రదారులు ఎంత మంది? ఎవరెవరు ఉన్నారన్న విషయంపై జిల్లా వ్యాప్తంగా చర్చోపచర్చలు జరుగుతున్నాయి. జిల్లాలోని నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, జూరాల హైడల్ ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న భూములకు సంబంధించి బాధితుల పేరున కొందరు డబుల్ క్లైమ్ చేసి, 3.08 కోట్ల రూపాయలను సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నట్లు సమాచారం.

అంతర్గత విచారణ

ల్యాండ్ అక్విజేషన్ వ్యవహారంపై అంతర్గత విచారణ చేపట్టిన న్యాయాధికారి భారీ కుంభకోణం జరిగిందని హైకోర్టుకు నివేదిక సమర్పించారని విశ్వసనీయంగా తెలిసింది. దీంతో ఈ విషయంపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ నిర్మల ఫిర్యాదు మేరకు పోలీసులు 477ఏ, 409, 465, 468, 420, బి రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

పక్కదారి పట్టిన పరిహారం

సీసీబీ ఖాతా అండ్ రిజిస్టర్లు 37, 38, 39లను పరిశీలించగా బ్యాలెన్స్‌లో తేడాలు ఉన్నాయని, వైట్‌నర్‌తో పేర్లను ట్యాంపరింగ్ చేశారని సీనియర్ సూపరింటెండెంట్ నిర్మల ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరు రైతుల పేర్లను డబుల్ ఎంట్రీ చేసి 3,08,33,160 రూపాయలను 2016, డిసెంబర్ 24 నుంచి 2021, ఆగస్టు 16 వరకు దాదాపు తొమ్మిది సార్లు సూపరింటెండెంట్ సత్యనారాయణ తన భార్య లలిత పేరున బదిలీ చేసుకున్నారని పేర్కొన్నారు. దీంతో వారిద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అయితే ఈ కుంభకోణంలో వీరిద్దరితో పాటు మరికొందరి హస్తం కూడా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారిలో కొందరు కేసు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు సమాచారం.

కేసు నమోదు చేశాం : సీఐ



డబుల్ క్లైమ్ వ్యవహారంలో కోర్టు సీనియర్ సూపరెంటెండెంట్ నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ టంగుటూరి శ్రీను 'ఆంధ్రజ్యోతి' కి తెలిపారు. ప్రస్తుతం కేసు విచారణ కొనసాగుతోందని, పూర్తయ్యాక పూర్తి వివరాలనువెల్లడిస్తామని చెప్పారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- జిల్లా వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా అండర్-19 బాల,బాలికల కబడ్డీ జట్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వాలీబాల్ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య అన్నారు. అడ్డాకుల మండలంలోని రాచాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వచ్చేనెల నవంబర్ మూడు నుంచి ఐదవ తేదీ వరకు రాష్ట్ర స్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ కబడ్డీ టోర్నీ నిర్వహించనున్నారు. అందులో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలను మంగళవారం స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల, కళాశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు రమేష్‌బాబు, వడెన్న, యాదయ్య, రాజవర్ధన్‌రెడ్డి, మేరీ పుష్ప పాల్గొన్నారు.

ఎంపికైన బాలురు, బాలికలు

బాలుర జట్టుకు పాండు, హరికృష్ణ, అంబరీష్, బాలక్రిష్ణ, ప్రవీణ్, నందకిశోర్, నవీన్‌నాయక్, బాలు, వంశీ, భాస్కర్, పవన్, విజయ్, అజయ్, బి.పవన్, చందు, నవీన్, వినోద్‌కుమార్, ఖాజా ఎంపికయ్యారు. బాలికల జట్టుకు మౌనిక, నవనీత, సింధూజ, గంగ, కావేరి, పార్వతి, గాయత్రి, బి.గాయత్రి, సృజన, అనిత, జ్యోతి, సంగీత ఎంపికయ్యారు.

బెటాలియన్ సిబ్బంది రక్తదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఐజీ, కమాండెంట్

ఎర్రవల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎర్రవల్లి మండలంలోని పదో బెటాలియన్‌లో సిబ్బంది రక్తదానం చేశారు. బెటాలియన్స్ రాష్ట్ర డీఐజీ సిద్ధిక్, కమాండెంట్ సాంబయ్యతో కలిసి శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు అమరుల త్యాగాలను స్మరించుకుంటూ రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదానం చేసిన సిబ్బందికి డీఐజీ, కమాండెంట్‌లు పండ్లు, జ్యూస్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్ చౌహాన్, అర్ఐలు రాజారావు, వెంకటేశ్వర్లు, అర్పీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గద్వాల విద్యార్థి



గద్వాల అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీకాం ఫైనల్ ఇయర్ విద్యార్థి ఎం.కుమార్ తైక్వాం డో ఆల్ ఇండియా టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. పాలమూరు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సౌత్ జోన్ అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల టోర్నమెం ట్‌లో ప్రతిభను చాటిన కుమార్ జాతీయ స్థాయి పోటీకి అర్హత సాధించారు. పంజాబ్‌లోని గురు నానక్ దేవ్ విశ్వవిద్యాలయంలో త్వరలో నిర్వ హించనున్న ఆల్ ఇండియా టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి కుమార్‌ను మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

సీఎం నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు తాము శంకుస్థాపన చేస్తే వాళ్లు శిలాఫలకాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం కావడంతో ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఈ ప్రభుత్వంపై తొమ్మిది నెలల్లోనే ప్రజా వ్యతిరేకత వచ్చిందన్నారు. నిజంగా ప్రజా ప్రభుత్వమే అయితే ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో మైలారం మైనింగ్‌ను నిలిపివేయించామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డగోలుగా తవ్వకాలు చేసి వేల కోట్ల రూపాయలు దోచుకోవాలని చేస్తోందని ఆరోపించారు. మైనింగ్ తవ్వకాలను గ్రామస్థులు వ్యతిరేకిస్తే కేసులు నమోదు చేశారన్నారు. అమ్రాబాద్ మండలంలోని లక్మాపూర్ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గుప్తనిధులు తవ్వుతూ ఎమ్మెల్యే ప్రధాన అనుచరులు అడ్డంగా దొరికితే నేటికి వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ నర్సింహ్మా గౌడ్, నాయకులు రమేశ్‌రావు, అమీనొద్దీన్, తిరుపతయ్య, నర్సయ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

జిల్లా బాలికల జట్టుకు అభినందనలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన బాలికల జట్టును పలువురు అభినందించారు. వరంగల్ జిల్లాలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ టోర్నీలో మహబూబ్‌నగర్ బాలికల జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా పట్టణంలోని స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర జట్టు క్రీడాకారులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ సాఫ్ట్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన సీనియర్ క్రీడాకారుడు నందన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోచ్ సాధిక్‌అలీ, ఆనంద్‌కుమార్, రాఘవేందర్, నాగరాజు, మేరిపుష్ప పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..



లోవోల్టేజీ సమస్య లేదు

- విద్యుత్ ఏఈ సత్తయ్య

కోయిలకొండ, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో లోవోల్టేజీ సమస్య లేదని విద్యుత్ శాఖ ఏఈ సత్తయ్య తెలిపారు. విద్యుత్ సరఫరా విషయమై ఆంధ్రజ్యోతితో పలు విషయాలను వెల్లడించారు.

లోవోల్టేజీ సమస్యను ఎలా పరిష్కరించారు ?

మండలంలో ఆరు సబ్‌స్టేషన్‌ల ద్వారా వ్యవసాయ మోటార్లకు, గృహాలకు విద్యుత్ అందిస్తున్నాము. లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా అవసరం ఉన్న చోట ట్రాన్స్ ఫార్మర్‌లు ఏర్పాటు చేశాము.

నూతన సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేస్తున్నారా?

మండలంలో నూతనంగా మూడు సబ్‌స్టేషన్‌లు మంజూరయ్యాయి. కోయిలకొండ మండల కేంద్రంలో, రాంపూర్, అంకిళ్లలో నూతనంగా 33/11 సబ్‌స్టేషన్‌లు మంజూరయ్యాయి. సబ్‌స్టేషన్‌ల నిర్మాణం కోసం స్థలం ఎంపిక చేశాము.

ఉచిత విద్యుత్ ఎంత మందికి ఇస్తున్నారు ?

మండలంలో 8,340 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో 5,820 మందికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ అందుతుంది. పెండింగ్‌లో ఉన్న వాటికి విచారణ చేసి విద్యుత్ అందిస్తాము.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకొంటారు?

మండలంలో విద్యుత్ సమస్యలు తలెత్తితే పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాము. సబ్‌స్టేషన్‌ల వారీగా లైన్‌మెన్, గ్రామ విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉంటారు.

న్యూస్ బాక్స్

డంపింగ్‌యార్డ్ అప్రోచ్ పనుల పరిశీలన

మహబూబ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భూత్పూర్- చించోళి హైవే పాలమూరు పురపాలిక డంపింగ్ యార్డ్‌ను ఆనుకుని వెళుతుండటంతో డంపింగ్‌యార్డ్ వద్ద అప్రోచ్ రోడ్డు పనులు సాగుతున్నాయి. మంగళవారం పుర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి డంపింగ్‌యార్డ్ వద్ద జరుగుతున్న అప్రోచ్ రహదారి పనులను పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌కు ఆనుకుని జాతీయ రహదారి వెళుతుండటంతో డంపింగ్‌యార్డ్‌లోకి చెత్తను తరలించే వాహనాలు వెళ్లేందుకు హైవే నుంచి డంపింగ్‌యార్డ్‌కు అప్రోచ్ పనులు చేపడుతున్నారు.

ఈ పనులు పరిశీలించిన కమిషనర్ త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. లేదంటే డంపింగ్ యార్డ్‌కు చెత్తను తీసుకెళ్ళే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయని అన్నారు.

పాలమూరుకు చేరిన మాల చైతన్య యాత్ర

పాలమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణను అడ్డుకునేందుకు చేపట్టిన మాలచైతన్య యాత్ర మంగళవారం మహబూబ్‌నగర్‌కు చేరుకుంది. మాలలను చైతన్యం చేసేందుకు చేపట్టిన వర్గీకరణ వ్యతిరేక పోరాట యాత్ర హైదరాబాద్ నుంచి కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజాంబాద్ మీదుగా మంగళవారం మహబూబ్‌నగర్‌కు చేరుకుంది. ముఖ్యఅతిథిగా హాజరైన మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వర్గీకరణను అడ్డుకుందామన్నారు.

అనంతరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి వనపర్తి జిల్లా కన్వీనర్‌గా మద్దిలేటిని నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నరసింహయ్య, సహదేవుడు, విజయకుమార్, రమేష్, శాంతన్న, కురుమూర్తి, నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులకు అన్నదానం

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కేంద్ర హోంమంత్రి అమిత్‌శా జన్మదినాన్ని పురస్కరించుకొని పాలమూరు పట్టణంలోని 47వ వార్డులో ఆ వార్డు బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి దర్పల్లి హరికృష్ణ మంగళవారం మునిసిపల్ కార్మికులకు అన్నదానం చేశారు.

డ్రగ్స్ అరికట్టేందుకు సహకరించాలి

- ఎస్సై భాస్కర్‌రెడ్డి

కోయిలకొండ, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): నిషేధిత డ్రగ్స్ వాడకం అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వాడకం, 'తెలంగాణ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులు మొబైల్ ఫోన్ వాడకం తగ్గించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

ఆసుపత్రి ఉన్నా వైద్యం అంతంతే..

- కోయిలకొండ ప్రభుత్వ దవాఖాన తీరిది
- సిబ్బంది అరకొర.. నిండుకున్న మందులు
- అధికారుల నిర్లక్ష్యంతో డీహెచ్- టీవీవీపీలో నమోదవని ఆసుపత్రి



కోయిలకొండలోని ప్రభుత్వ ఆసుపత్రి

కోయిలకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోయిలకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు వైద్యం అందడంలేదు. జిల్లా వైద్యాధికారుల నిర్లక్ష్యం వల్ల డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో, తెలంగాణ వైద్య విధాన పరిషత్ రికార్డులో లేని ఆసుపత్రిగా నిలిచింది. ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉంది. సరిపడా మందులు ఉండటం లేదు. బీపీ మిషన్ తప్ప పరికరాలు లేవు. కనీసం రక్తపరీక్షలు చేయడం లేదు. గాయపడిన వారికి టీటీమందు ఇచ్చి, కట్టు కట్టే అవకాశం కూడా లేని పరిస్థితి ఉంది. ఇద్దరు డాక్టర్లు, స్టాఫ్ నర్స్, ఏడుగురు సిబ్బంది పని చేస్తున్నారు. సిబ్బంది లేకపోవడం వల్ల ఇక్కడికి రావడానికి రోగులు కూడా ఆసక్తి చూపడం లేదు. ఈఆసుపత్రిని తెలంగాణ వైద్యవిధాన పరిషత్‌లోకి మార్చాలని, సరిపడా సిబ్బందిని, పరికరాలను, మందులు అందించాలని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఇటీవల వినతిపత్రం అందించారు. కలెక్టర్ విజయేందిర బోయి గతంలో ఈ ఆసుపత్రిని తనిఖీ చేసి విస్తుపోయారు. అపరిశుభ్ర వాతావరణం, మందుల నిర్వహణ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



కోయిల్‌కొండ ఆసుపత్రిలో నిరుపయోగంగా ఆపరేషన్ థియేటర్

డాక్టర్లు ఉండేలా చూడాలి



కోయిలకొండ ప్రభుత్వ దవాఖానకు పోతే మందులు లేవు. చూడనీకె డాక్టర్లు లేరు. పాత భవనంలో దవాఖానలో బాగుండె. కొత్త దవాఖాన కట్టిన తర్వాత మందులు ఏమీలేవు. ఆసుపత్రిని బాగు చేసి, మందులు ఇవ్వాలి. డాక్టర్లను నియమించాలి.

- బి.లక్ష్మయ్య, కోయిలకొండ

బండ్లు కట్టుకొని వచ్చేవారు..



గతంలో కోయిలకొండ దవాఖానకు ఇతర ప్రాంతాల నుంచి ప్రసవాల కోసం ఎద్దుల బండ్లు కట్టుకొని వచ్చేవారు. ఇప్పుడు మూడు అంతస్తుల భవనం ఉన్నా మందులు లేవు. సరైన డాక్టర్లు లేరు. పేదలకు వైద్య సేవలు మరింత మెరుగుపరచాలి.

- భీమమ్మ, కోయిలకొండ

అధికారుల దృష్టికి తీసుకెళ్లాము



ఆసుపత్రిలో సిబ్బంది కొరత, మందుల సమస్యపై జిల్లా వైద్యాధికారులకు నివేదిక అందించాము. ఆసుపత్రిలో రోగులకు వైద్యపరీక్షలు చేసి, పరిస్థితి బట్టి జిల్లా ఆసుపత్రికి పంపిస్తున్నారు. మందులను కొత్తబాద్ పీహెచ్‌సీ ద్వారా తెచ్చుకొంటున్నాము.

- డాక్టర్ అర్చన, కోయిలకొండ వైద్యురాలు

పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

జడ్చర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, పలు సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని తపస్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలలో మంగళవారం భోజనం విరామం సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో పాటు 317 బాధితులకు న్యాయం చేస్తూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని స్కావెంజర్స్, స్వీపర్లను వెంటనే నియమించాలని అన్నారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, కార్యదర్శి కృష్ణవాల్మీకి, ట్రెజరర్ శ్రీనివాస్‌శెట్టి, పలువురు ఉపాధ్యాయులున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి దార సుందర్ తెలిపారు. ఉద్యోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. మంగళవారం స్థానిక బోయపల్లి రోడ్డులో గల సత్యసాయి బాబా ఫంక్షన్ హాల్‌లో టీ ఎస్ ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈసమావేశానికి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్, కృష్ణ, రాష్ట్ర చైర్మన్ రాజయ్య నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా ఉద్యోగుల సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష కార్య దర్శులు ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అచ్చంపేట డిపోకి చెందిన వెంకటయ్య ప్రధాన కార్యదర్శిగా కల్వకుర్తి డిపోకు చెందిన కండక్టర్ దార సుందర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మహబూబ్‌నగర్ పురపాలక కౌన్సిలర్ జాజిమొగ్గ నరసింహులును ఎన్నుకున్నారు. వీరికి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నియామక పత్రాలు అందజేశారు.

అనంతరం నూతనంగా ఎన్నికైన వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జోనల్, రీజినల్, డిపోల అధ్యక్ష కార్యదర్శులు, నాయకులుపాల్గొన్నారు.

కురుమూర్తి వద్ద గుడారాల ఏర్పాటు

చిన్నచింతకుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలో కురుమూర్తి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 31నుంచి యాగశాల మండపాలంకరణతో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జాతరలో వివిధ రకాల దుకాణాల ఏర్పాట్లలో వ్యాపారులు బిజీగా ఉన్నారు. ఇప్పటికే జాతర మైదానంలో హోటళ్లు, వివిధ రకాల దుకాణాల సముదాయాలు వేసే పనులు జరుగుతున్నాయి. అలాగే ఆలయ మెట్లకు, రాజగోపురం వంటి వాటికి రంగులు వేసే పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. మైదానంలోనూ పనులు జరుగుతున్నాయి. కురుమూర్తి జాతరకు లక్షల మంది భక్తులు రానున్న నేపథ్యంలో భక్తులకు 40వరకు టాయిలెట్స్ మంజూరైనట్లు ఆలయ ఈవో తెలిపారు.

ముడా చైర్మన్ ప్రమాణ స్వీకారానికి మంత్రులకు ఆహ్వానం



మంత్రి దామోదర రాజనర్సింహ్మతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్

మహబూబ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర మంత్రులను ఆహ్వానించారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో జరిగే ప్రమాణ స్వీకారానికి హాజరుకావాల్సిందిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఆర్అండ్‌బి శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రులు ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఏఈకి వినతి



మిషన్ భగీరథ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ సారికరాంమోహన్

జడ్చర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మునిసిపాలిటీలోని పలుకాలనీలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ పాలాది సారిక రాంమోహన్ ఆధ్వర్యంలో మంగళవారం మిషన్‌భగీరథ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కౌన్సిలర్‌లు మాట్లాడారు. నిత్యం 12 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాలని ఏఈని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పుష్పలత, లత. నవనీత, నందకిషోర్, మహేష్, శశికిరణ్, ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

శ్రీకాంత్‌గౌడ్‌పై చర్యలు ఎందుకు తీసుకోరు?

మహబూబ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రిష్టియన్‌పల్లి సర్వే నెంబర్ 523లో నకిలీ పట్టాలు సృష్టించి డబ్బులకు డబుల్ బెడ్‌రూమ్‌లు అమ్ముకున్న కేసులో ఏ4గా ఉన్న శ్రీకాంత్‌గౌడ్‌పై పోలీసులు చర్యలు తీసుకోకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని పాలమూరుకు చెందిన మున్నూరురవి, మైత్రియాదయ్య, విశ్వనాథ్‌బాండేకర్ ప్రశ్నించారు. ఈ కేసులో నెల రోజులుగా ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపించిన పోలీసులు ఏ4గా ఉన్న వ్యక్తిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. మంగళవారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే శ్రీకాంత్‌గౌడ్ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ముందస్తు బెయిల్ రద్దు చేసినా ఆయన పోలీసులకు సరెండర్ కాకపోవడం దారుణమని, పోలీసులు కూడా ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. గతంలో తాము ఏ తప్పు చేయకున్నా మాజీమంత్రి హత్యకు కుట్రచేశామని 33 రోజులు జైలుపాలు చేశారని, ఎంతో నరకం అనుభవించామన్నారు. తొమ్మిది నెలలుగా అధికారులు ప్రజలు, వ్యాపారులు స్వేచ్ఛగా తమ పనులు చేసుకుంటున్నారన్నారు. ఈ స్వేచ్ఛ ఇలానే కొనసాగాలంటే వెంటనే ఏ-4ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలి

దేవరకద్ర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రయివేటు పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలని ఎంఈవో బాల్‌రాం ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రయివేటు పాఠశాలలు సీవీ రామన్, వెంకటసాయి, తపోవహన్ పాఠశాలలను, పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులు రాస్తున్న పరీక్ష పత్రాలను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రశ్నాపత్రాలను మాత్రమే ఉపయోగించాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జోబి థామస్, నిరంజన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

హన్వాడ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షేక్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మొగులయ్య భార్య ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం గ్రామానికి వెళ్లి మొగులయ్యను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కర్నాకర్ గౌడ్, సొసైటీ చైర్మన్ వెంకటయ్య రాఘవులు, శ్రీనివాసులు, చెన్నయ్య ఉన్నారు.

కాంగ్రెస్ నాయకునికి ఎమ్మెల్యే పరామర్శ



రాములును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన కావలి రాములు గత కొన్ని రోజులుగా కాలికి గాయమై ఇన్‌ఫెక్షన్ కావడంతో చికిత్సపొంది ఇంటికి రాగా మంగళవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పరామర్శించారు. ఆయనవెంట పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

ఆర్‌పీ శ్రీలతపై కేసు

మహబూబ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఆర్‌పీ శ్రీలతపై కేసు నమోదైంది. పట్టణంలోని కోయనగర్ మహిళా సమాఖ్యలో రూ.1.49 కోట్లు దారి మళ్లించినట్లు తేలడంతో మంగళవారం మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఆర్‌పీ శ్రీలతపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై విజయ్ తెలిపారు.

'డబుల్' ఇళ్ల ఫిర్యాదులపై నేటి నుంచి విచారణ

- 15 మంది అధికారుల నియామకం

- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్) అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపులో అక్రమాలు, అవకతవకలు, జరిగినట్లు వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులపై ఈనెల 23నుంచి సమగ్ర తుది విచారణకు కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణకు 15మంది అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ తిరిగి విచారణ అనంతరం తుదిజాబితాను సమర్పించనున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో దివిటిపల్లిలో 1024, వీరన్నపేటలో 660, క్రిస్టియన్‌పల్లిలో 310 మొత్తం 1994 ఇండ్ల నిర్మాణాలు చేసి లబ్ధిదారులకు కేటాయింపు చేయడం జరిగింది. డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపుల్లో అనర్హులకు, స్థానికేతరులకు, ఒకరికి కేటాయింపు చేసిన ఇంటిలో వేరే వారు అక్రమంగా నివాసం ఉండడం, ప్రభుత్వ ప్రైవేట్, రిటైర్డ్ ఉద్యోగులకు కేటాయింపు చేశారన్న ఆరోపణలు వచ్చాయని, అర్హులైన నిరుపేదలకు కేటాయింపు జరుగకుండా అనర్హులకు కేటాయింపు చేశారని నిరుపేదల నుండి దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ ఆరోపణలు, ఫిర్యాదులపై గతంలో నిర్వహించిన ప్రాథమిక విచారణలో అనర్హులకు కేటాయింపు జరిగినట్లు ఆధారాలు లభించాయని తెలిపారు. ఈనేపథ్యంలో మరోసారి తుది విచారణకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఏనుగొండకు సంబంధించిన 588 ఇండ్ల లబ్ధిదారుల అర్హతపై విచారణ పూర్తయ్యిందని తెలిపారు.

సమష్టి కృషితోనే ఆర్టీసీకి అధిక ఆదాయం



ఉద్యోగులకు అవార్డులు అందిస్తున్న ఆర్ఎం శ్రీదేవి

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా సమిష్టి కృషితో ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించి రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయంతో రీజియన్‌ను మొదటి స్థానంలో ఉంచినందుకు అందరికీ పేరుపేరున అభినందనలు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో 2024-25 సంవత్సరం రెండవ త్రైమాసికంలో రాఖీపౌర్ణమి, దసరా పండుగ సందర్భంగా రీజియన్‌లో ఉద్యోగులు సమష్టిగా కష్టపడి అత్యధిక ఆదాయాన్ని సమకూర్చినందుకు ఎండీ ఆదేశాలను అనుసరించి ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. ఇదే స్ఫూర్తితో రాబోయే దీపావళి, శుభకార్యాలు, ముహూర్తాలు, కార్తీక మాసంలో పనిచేసి రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన రీజియన్‌గా మన రీజియన్‌ను నిలపాలని కోరారు.

పంచాయతీ నిధులు పక్కదారిపై విచారణ

- కార్యదర్శులకు మెమోలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నవాబ్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొంతకాలంగా పంచాయతీ నిధులు పక్కదారి పడుతున్న విషయంపై మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో ఎంపీడీవో జయరాములు స్పందించారు. ఏయే గ్రామాల్లో నిధులు పక్కదారి పట్టాయో విచారణాధికారిని నియమించి పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని తెలిపారు. సుమారు 18గ్రామాల కార్యదర్శులకు మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. నిధులు డ్రాతో పాటు పారిశుధ్య వస్తువులు కొను గోలు రికార్డులు పరిశీలిస్తామని బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. కాగా సదరు అధికారి కొందరు కార్యదర్శులపై రుసరుసలాడినట్లు తెలిసింది. నిధుల విచారణ జరిగితే తాము ఉన్నది ఉన్నట్లు చెప్పేందుకు కార్యదర్శులు నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

ఐటీ టవర్‌ను సందర్శించిన కలెక్టర్



దివిటిపల్లి ఐటీ టవర్‌ను సందర్శించిన కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ అర్బన్ మండలం దివిటిపల్లి పరిధిలోని ఐ.టి టవర్‌ను కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్‌డీవో నవీన్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ అందించాలి

- ఎమ్మెల్యేను కలిసిన మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ ఏఈలు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి విద్యుత్ అధికారులకు సూచించారు. మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ బాధ్యతలు తీసు కున్న ఏఈలు మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అసౌకర్యం కల్పించరాదని అన్నారు. అందరం కుటుంబ సభ్యులుగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బుద్దారం సుధాకర్‌రెడ్డి, అరీఫ్, జకీ, తిరుమలేష్ పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన విద్యార్థులు



బొటానికల్ గార్డెన్‌లో కళాశాల విద్యార్థులు

జడ్చర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉన్న తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థులు సందర్శించినట్లు మంగళవారం గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ సదాశివయ్య తెలిపారు. అంతరించిపోతున్న మొక్కల ఔచిత్యాన్ని అలంకరణ మొక్కలతో పాటు పలుమొక్కల గురించి విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుకన్య, వైస్ ప్రిన్సిపాల్ నర్మద, వైష్ణవి కళాశాల ప్రిన్సిపాల్ రవిందర్‌తో పాటు తదితరులున్నారు.

48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు

- పాతమొల్గరలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్



పాతమొల్గరలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

భూత్పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం అమ్మిన 48గంటల్లోనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మద్దిగట్ల గ్రామ శివారులో ఉన్న మద్దికాన్ చెరువులో ప్రభుత్వం నుంచి మంజూరైన ఉచిత చేపపిల్లల పంపిణీ, మండలంలోని పాతమొల్గరలో రైతుల వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా అక్కడికి వచ్చిన పాత్రికేయులతో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడారు. గత ప్రభుత్వం రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి నెలల తరబడి వారికి డబ్బులు చెల్లించకుండా నానాఇబ్బందుల పాలు చేసిందని, అలాకాకుండా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద కొనుగోలు చేసిన 48గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందని ఈసందర్భంగా స్పష్టంచేశారు. అదేవిధంగా సన్నవరి ధాన్యానికి గతంలో ప్రకటించనట్లుగా ప్రతి క్వింటాకు రూ.500 బోనస్ కూడా వెంటనే జమచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే రైతులకు భరోసానిచ్చారు. కౌలు రైతులకు కూడా ప్రభుత్వం బోనస్‌తో పాటుగా మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో లూటీ చేసిందని క్వింటాలుకు 6-7కిలల తరుగు తీసి రైతులను దోచుకుందని ఎమ్మెల్యే జీఎంఆర్ విమర్శించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగనీయకుండా నిజాయితీగా రైతుల ఖాతాల్లో డబ్బులు చేరేలా చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే భూత్పూర్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ హర్యానాయక్, నాయకులు వెంకటేష్, రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లాలునాయక్, ఎంపీడీవో ప్రభాకచారి, డిప్యూటీ తహసీల్దార్ గీతా, అధికారులు, వివిధగ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.